www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 11 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

## ప్రశ్నించే వారిని బంధించే యత్నంలో కేంద్రం



-ప్రజాస్వామికవాదులపై ఎన్ఐఏ కేసులు ఉపసంహరించుకోవాలి
-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రశ్నించే వారిని నిర్బంధించి గొంతు నొక్కే ప్రయత్నంలో కేంద్రం పనిచేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఆ క్రమంలోనే ప్రజాస్వామిక వాదులపై జాతీయ దర్యాప్తు సంస్థ చేత విచారణకు పిలిపించి కేసులు నమోదు చేస్తున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును విచారణకు పిలవడం ప్రజాస్వామికవాదుల గొంతు నొక్కడమేనన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను

మిగతా 2లో..

## చావడం.. చంపడమే.. పరిష్కారమా...!



నశిస్తున్న సహనం

చోటు చేసుకుంటున్న అమానవీయ ఘటనలు

**సమాజంలో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చంపడమో, చావడమో మాత్రమే సమస్యకు పరిష్కారమన్న ధోరణి క్రమేపి పెరిగిపోతుంది.** భార్యాభర్తల మధ్య చిన్న చిన్న ఘర్షణలు కుటుంబాలను ఛిద్రం చేస్తున్నాయి. వారితో పాటు పిల్లలను బలితీసుకుంటున్నారు. ఆత్మహత్యలు ఒక ఎత్తయితే మరో పక్క దశాబ్దాల వైవాహిక బంధాన్ని సైతం కాదని పరాయి వ్యక్తులతో కలిసి కుటుంబ సభ్యులను అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. ఇందులో మహిళల పాత్ర కూడా క్రమేపి పెరుగుతుండటం శోచనీయం.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## ట్రంప్ దురహంకారానికి గుణపాఠం

-సిపిఎం ప్లీనరీలో తమ్మినేని

8లో

## మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపులు

3లో

## ఆదివాసీ సంస్కృతి పరిరక్షణే జాతి అస్తిత్వానికి బలం

- ఆదివాసీలే దేశానికి మూల వాసులు
- కోయ ఇలవేల్పుల చరిత్ర గ్రంధావిష్కరణలో మంత్రి సీతక్క
- ఐటిడిఏ పిఓకు ఆదివాసీరత్న బిరుదు

2లో



## చిరస్మరణీయుడు మహ్మద్ రజబ్ అలీ

-రజబ్‌అలీ ఆశయాలకు పునరంకితం కావాలి
-లంబాడోళ్ల రాందాస్‌గా గుర్తింపు
-వర్ధంతి సభలో బాగం
-రజబ్ అలీకి ఘన నివాళి

2లో





## కూసుమంచి మండలంలో పొంగులేటి సుడిగాలి పర్యటన



-చేగొమ్మలో రూ 1.52 కోట్లతో ప్యాక్స్ గోదాముల ప్రారంభం
-అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

3లో

## పేదల పెన్నిధి మహ్మద్ రజబ్ అలీ



-అలుపెరగని పోరాటయోధుడు
- ఐదుసార్లు ఎంఎల్ఏగా గెలిచినా సామాన్య జీవితం
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

2లో

# చావడం.. చంపడమే.. పరిష్కారమా..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సమాజంలో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చంపడమో, చావడమో మాత్రమే సమస్యకు పరిష్కారమన్న ధోరణి క్రమేపి పెరిగిపోతుంది. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న ఘర్షణలు కుటుంబాలను ఛిద్రం చేస్తున్నాయి. వారితో పాటు పిల్లలను బలితీసుకుంటున్నారు. ఆత్మహత్యలు ఒక ఎత్తయితే మరో పక్క దశాబ్దాల వైవాహిక బంధాన్ని సైతం కాదని పరాయి వ్యక్తులతో కలిసి కుటుంబ సభ్యులను అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. ఇందులో మహిళల పాత్ర కూడా క్రమేపి పెరుగుతుండటం శోచనీయం. మారిన కాలమాన పరిస్థితుల్లో సహనం నశిస్తుంది. ఓపికతో సమస్యకు పరిష్కారం అన్వేషించాలన్న ఆలోచన ధోరణి నశించింది. అప్పటికప్పుడే పరిష్కారం దొరకాలన్న ధోరణి పెరిగిపోతుంది. యుక్త వయస్సులో కొందరు దారి తప్పి సరిచేసుకోలేక ప్రాణాలను వదిలేస్తుంటే మరి కొందరు చిన్న చిన్న ఘటనలకే విలువైన ప్రాణాలను తీసుకుంటున్నారు. మనో ధైర్యాన్ని కోల్పోవడం తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. ఇంటర్ విద్యార్థి పరీక్షా ఫలితాల సమయం దగ్గరకొచ్చింది ఉత్తీర్ణురాలిని అవుతానా కానా అన్న మీమాంస గడిచిన రెండు రోజులుగా అతని మదిని తొలుస్తుంది. ఒకవేళ ఉత్తీర్ణత సాధించలేకపోతే అన్న ప్రశ్నకు అతనికి చావే పరిష్కారం అన్న భావన స్ఫూరించింది. అంతే రైలుకింద పడి నిండు ప్రాణం తీసుకున్నాడు. ముక్కలైన ఆ శరీర భాగాలను చూసి తల్లిదండ్రుల మనస్సు కకావికలమైంది. కుటుంబ సభ్యుల మధ్య కూడా ఆత్మీయత, అనుబంధాలు తగ్గిపోయి ఎవరికి వారే కృత్రిమంగా జీవించడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. కలిసి ఉన్నట్లే ఉన్న కలవని మనస్సులు ఈ పరిస్థితికి దారి తీస్తున్నాయి. చాలా మంది కుటుంబ సభ్యుల మధ్య ఫోన్‌తో నిమగ్నమై పోవడంతో పొడి పొడి మాటలు తప్ప సుదీర్ఘ సంభాషణలే కరువవుతున్నాయి. ఇప్పుడు జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలు రెండింటికి రెండే కారణాలు ఒకటి డబ్బు, రెండవది అక్రమ సంబంధాలు. రెండు రోజుల క్రితం మీడియాలో వచ్చిన ఒక వార్త యావత్ సమాజాన్ని ఆలోచింపజేసింది. పెళ్లయిన కొన్ని ఏండ్ల తర్వాత భర్త నల్లగా ఉన్నాడని పరాయి వ్యక్తులతో కలిసి తన పక్కనే నిద్రిస్తున్న భర్తను అతి కిరాతకంగా హత్య చేయించింది. ఇక్కడొక విషయాన్ని గమనించాలి. మూడు నెలల కాలంలో అక్రమ సంబంధాల నేపథ్యంలో భార్యలను చంపిన లేదా భర్తలను చంపిన పోలీస్ విచారణలో దొరక్కుండా ఉన్నవారు లేరన్నది గ్రహించడం లేదు. గుండెపోటుతో చనిపోయాడని, ఈత కొలనులో మునిగారని, మద్యం ఎక్కువై మరణించాడని, ఒత్తిడికి గురై మరణించాడని ఇలా ప్రాథమిక స్థాయిలో కారణాలు ఎన్ని చెప్పినా ఇందుకు కారకులైన వారు మాత్రం పోలీస్ విచారణలో దోషులుగా నిలబడక తప్పడం లేదు. కేవలం వ్యామోహమే ఈ పరిస్థితికి కారణమవుతుంది. ఆర్థిక వ్యవహారాల్లో రక్త సంబంధికులను హత్య చేస్తున్నారు. కుటుంబ సభ్యులను సైతం హతమార్చేందుకు వెనకాడడం లేదు. ఈ ధోరణి మారకపోతే ప్రతి సమస్యకు చావడమో చంపడమో పరిష్కారమన్న ధోరణి ప్రభలి ఒకరినొకరు నమ్మలేని ఒక అనాగరిక సమాజం వైపు పయనించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సెల్ ఫోన్, టివి తోనే నిరంతరం కాలక్షేపం చేసే వారిలో సహనం నశిస్తుందని వైద్యులు చెబుతున్న పట్టించుకోవడం లేదు. చివరికి ఎలా చంపాలో ఎలా చావాలో కూడా సెల్‌ఫోన్‌లో చూస్తుండటం మరింత దారుణం. ఈ సమస్యకు పరిష్కారం కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, అనుబంధాలు పెరిగేవిధంగా వ్యవహరించడం. వీలైనంత మేర సన్నిహిత్యంతో గడపటం ద్వారా అక్రమ సంబంధాలకు తెరవేయడం , పోలీస్ ఇతర ప్రభుత్వ సంస్థలు ఇటువంటి హత్యల ద్వారా దొరికిపోయి జీవితాలను ఛిద్రం చేసుకున్న వాస్తవ ఘటనలను ప్రజలకు వివరించడం, మరో పక్క విలాసవంతమైన జీవితాలకు తెరపడేలా చర్యలు తీసుకోవడం ఇందుకు అనుగుణంగా ప్రజలను చైతన్యవంతం చేయడం ఇప్పుడు అందరి కర్తవ్యం కావాలి. పసిమనస్సుల్లో నాటుకుంటున్న నిరాశ నిస్పృహాలను పొగొట్టేవిధంగా విద్యాలయాల్లో ప్రత్యేక బోధన జరగాల్సి ఉంది. కుటుంబాల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, అనుబంధాలు పెరిగేవిధంగా సామాజిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రవచకులు ఒక ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. లేదంటే ఓ హింసాత్మక సమాజం భవిష్యత్తులో రూపుదిద్దుకుంటుంది.

# చిరస్మరణీయుడు మహ్మద్ రజబ్ అలీ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** సుదీర్ఘ కాలం శాసన సభ్యునిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహ్మద్ రజాబ్ అలీ చిరస్మరణీయుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా రజబ్ అలీ ప్రజల మదిలో నిలిచిపోయారన్నారు. మహ్మద్ రజబ్ అలీ 30వ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం వారి స్వగ్రామం మండల పరిధిలోని పాపటపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ రజబ్‌అలీ, మాజీ సర్పంచ్, సిపిఐ నాయకులు కూరాకుల నర్సయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ లు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రజబ్ అలీ తొలి నాళ్లలో ఉర్దూ తెలుగు అనువాదకునిగా పని చేశారన్నారు. తెలంగాణలో నాటి ప్రత్యేక పరిస్థితులను చూసి కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఆంధ్ర మహాసభ రైతాంగ ఉద్యమంలో, బండి పట్టాల ఉద్యమంలోను చురుకుగా పాల్గొన్నారని హేమంతరావు తెలిపారు. సాయుధ తెలంగాణ పోరాట కాలంలో మూడున్నర ఏళ్ల పాటు రజబ్ అలీ జైలు జీవితం గడిపారన్నారు. ఖమ్మం నియోజక వర్గం నుండి రెండు సార్లు, సుజాతనగర్ నియోజక వర్గం నుంచి నాలుగు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారన్నారు. చట్టసభలలో పేదల వాణి వినిపించి ప్రజల మనిషిగా పేరొందరన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పలు ప్రజా ఉద్యమాలకు రజబ్ అలీ నాయకత్వం వహించారని గణేశ్వరం, వినోభానగర్ తదితర చోట్ల చారిత్రిక భూ పోరాటాలకు నాయకత్వం వహించి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారన్నారు. ముఖ్యంగా గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని, గిరిజనులు ఆయనను ముద్దుగా లంబాడోళ్ల రాందాస్‌గా పిలుచుకునే వారని హేమంతరావు గుర్తు చేశారు. పాలకుల, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే రజబ్ అలీకి మనమిచ్చే సరైన నివాళి అన్నారు. ఇదే గ్రామానికి చెందిన కూరాకుల నర్సయ్య రజబ్ అలీ అనుచరునిగా, గ్రామానికి సర్పంచ్‌గా అనేక ఏళ్లు పనిచేసి ప్రజా సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రజబ్‌అలీ ఆశయాలకు పునరంకితం అవుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని తెలిపారు. రజబ్‌అలీ స్ఫూర్తితో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అదేవిధంగా చిమ్మపుడి, కోయచలక, పంగిడి, ఈర్లపుడి, పుటానితండా గ్రామాల్లో రజబ్ అలీ వర్ధంతి సందర్భంగా రజబ్‌అలీ విగ్రహానికి, చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు, పగడాల మల్లేష్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, చిమ్మపుడి, కోయచలక గ్రామాల సర్పంచ్‌లు కోటేరు నర్సిరెడ్డి, బలుసుపాటి శేషయ్య, ఉప సర్పంచ్‌లు జులా వెంకటేశ్వర్లు, మాధంశెట్టి హన్మంతరావు, సిపిఐ నాయకులు ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, వడ్డె జగన్నాథరెడ్డి, రజబ్‌అలీ కుటుంబ సభ్యులు ఎండి ఖాజాబీ, మహబూబీ, గౌస్‌బేగం, సలీమా, పావురాల ఉషాబాబు, కృష్ణారావు, మధు, వంకాయలపాటి వేణు, గాడిచర్ల సత్యనారాయణ, మోహన్‌రావు, విష్ణుమూర్తి, పావురాల వెంకన్న, వివిధ పార్టీలకు చెందిన నాయకులు లక్ష్మణ్ గౌడ్, పాపయ్య, కోటిరెడ్డి, సత్యనారాయణ, నర్సయ్య, రామారావు, భద్రయ్య, రామచంద్రయ్య, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ సంస్కృతి పరిరక్షణే జాతి అస్తిత్వానికి బలం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణే జాతి అస్తిత్వానికి బలమని పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్లో ఆదివాసీ సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క కోయ ఇలవేల్పుల గ్రంధాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, అలవాట్లను భవిష్యత్ తరాల వారికి అందించడం ఎంతో అవసరం అన్నారు. ఆదివాసీలే దేశానికి మూలవాసులు అని, వారి సంస్కృతి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాని కలిగుందన్నారు. పాత తరాల నుంచి కుల దేవతలు, ఆరాధన, పూజా విధానాలు, పండుగలు, సంప్రదాయాలు లిఖిత రూపంలో భద్రపరచడంగర్వకారణమన్నారు. ముందుగా చిన్నారులు సాంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకోగా మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు, అధికారులు గిరిజన నృత్యాలు వేశారు. అనంతరం మహనీయులకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొర మాట్లాడుతూ గిరిజన సంస్కృతి క్రమంగా కనుమరుగవుతున్న తరుణంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేసి కోయభాష, సంస్కృతిని పరరిక్షించే చర్యలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఐటిడిఏ పిఓ రాహుల్, మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధి, విద్యార్థులు కెరియర్ గైడెన్స్, పోటీ పరీక్షల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలతో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోయ తెగకు చెందిన 142 ఇలవేల్పుల చిర్తర, ఏడు గట్టు గోత్రాలు, 750 ఇంటిపేర్ల వివరాలు సేకరించి పుస్తకం రూపంలో తీసుకురావడం విశేషమని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఇలవేల్పుల చరిత్ర సేకరణకు కృషి చేసిన ఐటిడిఏ పిఓ రాహుల్‌కు ఆదివాసీ వికాసరత్న బిరుదు ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే వారిని బంధించే యత్నంలో కేంద్రం

(మొదటిపేజీ తరువాయి) ప్రశ్నించడం ప్రభుత్వ చట్ట వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రజలను చైతన్యపర్చడం వామపక్ష వాదులుగా మా కర్తవ్యమని మా కర్తవ్య నిర్వహణను అడ్డుకునే అధికారం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. అర్బన్ నక్సలైట్ పేరుతో దేశంలోని బిజెపి వ్యతిరేక ప్రజాస్వామిక వాదులను అరెస్టు చేసి జైళ్లలో ఉంచుతారా అని ఆయన ప్రశ్నించారు. మొన్నటి వరకు జై శ్రీరామ్ జై మోడీ అన్నవారే దేశభక్తులని చిత్రీకరించారని ఇప్పుడు ప్రశ్నించే వారికి అర్బన్ నక్సలైట్ ముద్ర వేస్తారా అని హేమంతరావు ప్రశ్నించారు. సుదీర్ఘ కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో అనేక బెదిరింపులను, నిర్బంధాలను చవిచూశామని కానీ అకారణంగా జాతీయ దర్యాప్తు సంస్థను విపక్ష నాయకులపైకి ఊసిగొల్పిన ఏకైక ప్రభుత్వం మోడీ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సంక్షేమం కోసం, సమాజాభివృద్ధి కోసం కృషి చేసే వారి పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యంలోని భావస్వేచ్ఛ హక్కును హరించడమేనన్నారు. మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకు, సంపన్న వర్గాలకు మాత్రం ఊడిగం చేస్తుందని ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.యుద్ధ నేపథ్యంలో దేశం ఒక సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటుందని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ దేశంపై యుద్ధ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ మోడీ మౌనముద్రలో ఉన్నారని హేమంతరావు తెలిపారు. మోడీ, ట్రంప్ ఒప్పందం భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆయన స్పష్టం చేశారు. సిపిఐ(ఎంఎల్)మాస్లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై ఎన్ఐఏ నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక వాదులపై కేసులు నమోదు చేస్తే ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు.

# పేదల పెన్నిధి మహ్మద్ రజబ్ అలీ


**ప్రజాపక్షం/ కొత్తగూడెం:** ప్రజాపక్షపాతి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమర జీవి మహ్మద్ రజబ్ అలీ ఆశయాలు నిరంతరం కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో సుజాతనగర్ మాజీ శాసనసభ్యులు రజబ్ అలీ 30వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పాషా మాట్లాడుతూ రజబ్ అలీ ఐదు సార్లు ఎంఎల్‌ఏగా గెలుపొందినప్పటికీ సామాన్య జీవితాన్ని గడిపిన గొప్పనేత అని కొనియాడారు. సాయుధ పోరాట కాలంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పరాడి, వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అసెంబ్లీలో అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, పేద వర్గాలు, బహుజనల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. నేటి రాజకీయాల్లో విలుపలు పడిపోతున్న తరుణంలో రజబ్ అలీ పాటించిన నైతికత, నిజాయితీ నేటి తరనికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కె రత్నకుమారి, నాయకులు షాహీన్, అప్సర్, వినయ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇళ్లస్థలాలు ఇవ్వాలని శుక్రవారం నారపోగు ప్రసాద్ ఎంపిడిఓ శ్రీధర్‌రాజుకు వినతిపత్రం అందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్లు లేక ఎంతోమంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారని, వారిని గుర్తించి పారదర్శకంగా ఇళ్లను ఎంపిక చేయాలని విన్నవించారు. రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా సర్వే చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రేగళ్ళ శ్రీనివాసరావు, కాంపాటి రవి, ఇశ్రాయేలు ఉన్నారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



**ప్రజాపక్షం/బోనకల్ :** మధిర రైల్వే స్టేషన్ యార్డ్ దగ్గర గుర్తు తెలియన రైలు కిందపడి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. బోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన గంగాదేవుళ్ళ అశాంత్(17) ఇంటర్ విద్యార్థి ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు రాసి ఫెయిల్ అవుతానని భయంతో గురువారం రాత్రి మధిర రైల్వే స్టేషన్ మార్కెట్ యార్డ్ దగ్గరలో ప్రధాన రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్త బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మున్సిపాలిటీ చైర్మన్ శుక్రవారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగా ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేపట్టడం పట్ల ఆర్టీసీ కండక్టర్ ఆనంద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, ఆర్యవైశ్య సంఘం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పసుమర్తి చందర్‌రావు, మున్సిపాలిటీ మేనేజర్ నాగేశ్వరరావు, కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, రాధా, యాస నాగమణి, ప్రయాణికులు ,ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి మండలంలో పొంగులేటి సుడిగాలి పర్యటన

-చేగొమ్మలో రూ 1.52 కోట్లతో ప్యాక్స్ గోదాముల ప్రారంభం
-అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు





**ప్రజాపక్షం/కూసుమంచి :** రాష్ట్రంలో పేదల పక్షపాతిగా, ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యాన్ని నడిపిస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కూసుమంచి మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు.

### అన్నదాతకు భూ భారత రక్షణ...

చేగొమ్మ గ్రామంలో రూ 1.52కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదాములను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని అన్నారు. ఏడాదికి ఎకరానికి రూ 12వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ 500 బోనస్ ఇస్తున్నామని, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా సర్వే మ్యాప్‌లతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను రాష్ట్ర వ్యాప్తంగా 3.80లక్షల మందికి అందజేశామని తెలిపారు.

### వైద్యానికి పేదరికం అడ్డంకి కాకూడదు...

కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో 191 మంది బాధితులకు రూ 58.58లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. వైద్యం కోసం పేదవాడు అప్పుల పాలు కాకూడదన్నదనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయమని, అందుకే గతంలో కంటే రెట్టింపు నిధులను వైద్యానికి వెచ్చిస్తున్నామని అన్నారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న మంత్రి, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిపిపల్ ఛైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆటోనగర్ రోడ్డుకు మోక్షం

- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి పొంగులేటి
- సమస్యను పలుమార్లు వెలుగులోకి తెచ్చిన ప్రజాపక్షం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులో ఉన్న ఆటోనగర్‌రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేడు ఈ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సమస్యపై ప్రజాపక్షం దినపత్రిక పలుమార్లు కథనాలు ప్రచురించి ప్రజల ఇబ్బందులను వెలుగులోకి తీసుకువచ్చింది. అయినప్పటికీ గత పాలకులు పట్టించుకోకపోవడంతో సమస్య అలాగే కొనసాగింది. అయితే తన ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం విశేషం. ఇందుకుగాను మంత్రి చొరవ తీసుకుని రూ.4కోట్ల50లక్షల వ్యయంతో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ఎఫ్‌డిఆర్ కింద ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. ఇక రాదు అంటూ నిరాశకు గురవుతున్న ప్రజలకు రోడ్డు నిర్మాణం చేపట్టనుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును కేవలం ఆటోనగర్‌కే కాకుండా మద్దులపల్లిమార్కెట్ వరకు విస్తరిస్తుండటంతో అక్కడి రైతులు, స్థిర వ్యాపారులు, ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అడుగుతీసి.. అడుగేసేదెలా?

# మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపులు

- ఓ అధికారిపై సోషల్ మీడియాలో పోస్ట్ హల్చల్
- విచారణకు మహిళా సంఘాల డిమాండ్
- తీవ్రచర్చనీయాంశంగా మారిన ఉదాంతం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పాలేరుని యోజకవర్గానికి చెందిన ఓ విభాగంలో ఓ అధికారిపై లైంగిక వేధింపులు ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం చర్చనీయాశంగా మారింది. ఆ పోస్టు ప్రకారం సంబంధిత అధికారి గత కొంతకాలంగా మహిళలపై అనుచిత ప్రవర్తనకు పాల్పడుతున్నాడని ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే పలువురు మహిళా సభ్యులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై గతంలో ఉన్నతాధికారులు సంబంధిత అధికారిని హెచ్చరించినట్లు కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై మహిళా సంఘం సభ్యులు విచారణకు సిద్ధమవుతున్నారని సమాచారం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులోని నిజనిజాలపై స్పష్టత రావాల్సి ఉంది.

### విభాగంపై ఆరోపణలు...

ఆ విభాగంలో ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ప్రధాన విధులు ఉంటాయని తెలిసింది. ముగిసిన అనంతరం తదుపరి అంత విధులు పరిమిత స్థాయిలోనే కొనసాగుతాయని సమాచారం. ఈ సమయంలో ఎక్కువగా కింది స్థాయి సిబ్బందే పనులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఆ విభాగానికి అధికారిగా ఉన్న ఓ అధికారి తనకు కేటాయించిన బాధ్యతలపై నిర్లక్ష్యం చేస్తూ, మరో శాఖ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాడని, గుగుసలు వినిపిస్తున్నాయి. తనకు ఉన్న పరిచయాలను ఉపయోగించుకొని ఆ శాఖలో పనులు చేపిస్తూ అక్రమంగా ధనార్జనకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి గతంలో నిర్వహించిన శాఖలోనూ ఇటువంటి వ్యవహారానికి పాల్పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### విధుల్లోనూ అవకతవకలు...

విభాగం విధుల్లోనూ అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి అందులోని ఖర్చుల వ్యవహారాల్లో చేతివాటం చూపించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఐదేండ్లకు ఒకసారి ప్రజలకు పంచే ఓ ముద్రణ పనిలో అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. ఇందుకోసం తనకు పర్సంటేజ్ ఇచ్చే ఓ ప్రైవేట్ షాపుకు ఆర్డర్ ఇచ్చి ముద్రణ చేపట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఆ సమయంలో పెట్టే నిధుల వినియోగంలోనూ పారదర్శకత పాటించకుండా అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. అలాగే ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ఓ భూమి వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఇందుకు గాను తనకున్న రాష్ట్ర స్థాయి సంబంధాలతో పాస్‌బుక్కు వచ్చేలా తతంగం నడిపి సరి చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీయాలని పలువురు కోరుతున్నారు.

# లంకపల్లిలో చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని లంకపల్లి గ్రామంలో మన ఊరు మన వాడ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని హై స్కూల్ హెచ్ఎం నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రయాణికులు లంకపల్లి మన ఊరు మన వాడ యూత్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తిరుమలరావు, పెనుబల్లి మండల యూత్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, మన ఊరు మన వాడ యూత్ సభ్యులు మురళి, ప్రసాద్, అనిల్, సీతారాములు, సునీల్, గ్రామస్తులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

**- కమిషనర్ మున్వర్‌అలీకి వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు రూ.750 పోస్టల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌ను మున్సిపాలిటీనే కట్టాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాయలంలో కమిషనర్ మున్వర్‌అలీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏదులాపురంమున్సిపాలిటీలో ఇటీవల కృష్ణ అనే ఎలక్ట్రిషన్ స్తంభం మీద నుండి ప్రమాదవశాత్తూ కిందపడినాడని, అతనికి ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ ఉంటే వారికి ఉపయోగపడుతుందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా పని ప్రదేశాలలో కార్మికులు ఇబ్బందిపడకుండా చలివేంద్రాలు మజ్జిగ ప్యాకెట్లను ఇవ్వాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అనుముల నరేందర్‌రెడ్డి, సభ్యులు విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మధిర స్మశానవాటిక సందర్శించిన చైర్‌పర్సన్



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** మధిరలోని హిందూ స్మశాన వాటికను మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత శుక్రవారం సందర్శించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలతో మహాప్రస్థానం అత్యాధునిక నిర్మాణం కోసం డిఇ నరేష్‌రెడ్డి, కమీషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మధిరలోని హిందూ స్మశాన వాటికను అన్ని సౌకర్యాలతో ఆధునీకరించడానికి కావాల్సిన స్థలం, దానికి ఉండాల్సిన సౌకర్యాలపై అవగాహన కోసం పరిశీలించటం జరిగిందని తెలిపారు. ఈ స్మశాన వాటిలో ఉన్న నిర్మాణాలు, ఆక్రమణకు గురైన స్థలాలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించినట్లు తెలిపారు. స్మశాన వాటికలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు తగిన రీతిలో ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందచేయటం జరిగింది. మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ చేతుల మీదుగా మధిర బంజారాకాలనీకి చెందిన ముగ్గులు లబ్ధిదారులకు రూ.2.1లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయటం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సేవలు ప్రశంసనీయమని, ఆయన సిఫార్సుతో అర్హులైన పేదలకు తక్షణ సహాయం అందుతున్నదని తెలిపారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి తక్షణ సాయంగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయిస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు లబ్ధిదారుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, బాణావత్ వెంకటరమణనాయక్, నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, షేక్.జహంగీర్, షేక్.బాజీ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్ కట్టకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పరిధిలోని రిజర్వాయర్ ఆనకట్టపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ శుక్రవారం మున్సిపల్ కమీషనర్ గురులింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ నుండి రిజర్వాయర్ ఆనకట్టపై లైట్లు లేకపోవడంతో తాగుబోతులకు అడ్డాగా మారుతుంది. మార్నింగ్ వాకింగ్ వెళ్లే వారికి చేపలు పట్టే మత్స్యకారులకు ఇబ్బందిగా ఉంటుంది. లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వినతికి స్పందించిన కమీషనర్ గురులింగం త్వరలోనే విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ)బాబురావు పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకం ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, సొసైటీ సీఈవో ప్రసాద్, ఏటీఎం పవన్ కుమార్, సిబ్బంది నాగలక్ష్మీ, తిరుపతిరెడ్డి, మౌళి, రైతులు పాల్గొన్నారు.

## హెచ్‌పి వ్యాక్సిన్లను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** ప్రభుత్వం పద్నాలుగు ఏండ్లు నిండిన యువతుల కోసం తీసుకొచ్చిన హెచ్‌పి వ్యాక్సిన్లను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ఈ రాము అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌పి వ్యాక్సినేషన్ ప్రక్రియను ఆయన లాంఛనంగా యువతులకు అందించి ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ రాము మాట్లాడుతూ వ్యాక్సిన్లపై అపోహలను వీడాలని, పద్నాలుగు ఏండ్లు నిండిన యువతులు కచ్చితంగా తీసుకోవాలన్నారు. మండలంలో 316 మంది యువతులకు ఈ వ్యాక్సినేషన్ అందించడం జరుగుతుందన్నారు. వయస్సుపై వ్యాక్సిన్‌పై అపోహలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ప్రమాదాలను నివారించడమే ప్రధాన లక్ష్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించి ప్రమాదాలను నివారించడమే ప్రధాన లక్ష్యమని తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, ఎంపీడీవో జములారెడ్డి, ఎస్ఐ మేడా ప్రసాద్‌లు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "ఆరైవ్ అలైవ్"రోడ్డు భద్రతా కార్యక్రమానికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, వాలంటీర్ల నియామకం, ర్యాలీలు, హెల్మెట్ డ్రైవ్‌లు నిర్వహించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, ఎంపీడీవో జములారెడ్డిలు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. అనంతరం ఎస్ఐ మేడా ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమాల షెడ్యూల్ వివరాలను తెలిపారు. ఏప్రిల్ 13న గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు, 14న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ, 15న పిల్లల రోడ్ సేఫ్టీడే, 16న సిబ్బందికి హెల్మెట్, సీట్ బెల్ట్ అవగాహన, 17న గోల్డెన్ అవర్ శిక్షణ, 18న ట్రాఫిక్ ఉల్లంఘనలపై కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించి ప్రమాదాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఎంఈఓ యెదు సింహారాజు, సర్పంచ్ మందా నాగరాజు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇస్కఫ్ జిల్లా ప్రథమ మహాసభ




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ప్రపంచశాతి, సాంస్కృతిక స్నేహ సంబంధాల బలోపేతం లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్షిప్ (ఇస్కఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తొలి మహాసభ నేడు నిర్వహించనున్నట్లు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం పాల్వంచలోని సాయితేజ ఫంక్షన్ హాల్లో ఈ ప్రథమ మహాసభ జరగనుందన్నారు. ఈ మహాసభకు రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ హై కోర్టు న్యాయవాది కడారి ప్రభాకర్ రావు, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సీనియర్ నాయకులు డా.సూర్యదేవర రామ్మోహన్ రావు, గౌతమి కృష్ణ, కాలువ దేవదాసు, డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. జనగణమన జాతీయగీత రచయిత రవీంద్రనాద్ ఠాగూర్ నాయకత్వంలో ప్రపంచంలో వివిధ దేశాల మధ్య యుద్ధాలు లేకుండా శాంతియుతంగా ఉండాలని కోరుతూ 1943లో ఇస్కఫ్‌ను స్థాపించి కృషి చేశారని చెప్పారు. హైదరాబాద్‌లో రాష్ట్ర మహాసభలు, చెన్నైలో జాతీయ మహాసభలు మార్చి నెలలో జరిగాయని, నేడు జిల్లాలో మహాసభ జరుగుతుందని తెలిపారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షించే మేధావులు, కవులు, కళాకారులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముందుగా రాష్ట్ర నాయకులు వేము కొండల రావు ఆహ్వాన సంఘాన్ని పరిచయం చేసిన అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ కళాకారులు టి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడితో చిత్తు



- అధునిక పోకడలతో అనారోగ్యాలు
- పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులు
- మత్తుకు బానిసలై షుగర్, బిపి తెచ్చుకుంటున్న వైనం
- 25 నుండి 50 ఏళ్ల వారే అధికం
- జీవన విధానం, ఆహారపు అలవాట్లే కారణం
- అధిగ మించకుంటే అంతే సంగతి

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఉరుకుల పరుగుల జీవనం, ఒత్తిళ్లు, జీవన శైలిలో మార్పులతో యువతతో పాటు మధ్య వయస్కుల్లో కూడా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మధ్యకాలంలో మారిన జీవన విధానాల వల్ల ఒత్తిడి పెరిగి బిపి, దీర్ఘ కాలిక వ్యాధుల భారిన పడుతుండటం, కొన్ని సందర్భాల్లో గుండె పోటుకు దారితీయడం వంటి సంఘటనలు తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. అంతేకాకుండా వ్యాయామానికి దూరంగా ఉండటం, సమయం, సందర్భం లేకుండా భోజన తీసుకోవడం, మత్తుకు బానిసలై షుగర్ వంటి వ్యాధుల భారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇక మరికొందరు ఎక్కువ కాలం పాటు ఫాస్ట్ ఫుడ్, బయటి ఆహారాలకు అలవాటు పడి జీర్ణాశయక్యాన్సర్ వ్యాధి భారిన పడుతున్నారు. ఇదిలా ఉండగా 25 ఏళ్ల నుండి 50 ఏళ్ల లోపువారు మధుమేహం, రక్తపోటు, కిడ్నీసంబంధిత వ్యాధులు,స్థూలకాయం, గుండె నొప్పి లాంటి సమస్యలతో సతమతమవుతున్నారు. వీటంతటికీ కారణం జీవన విధానం,ఆహారపు అలవాట్లలో మార్పులే ప్రధాన కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. జీవన శైలిని మార్చుకోకుంటే 50 ఏళ్లలోపే మరణాలు సంభవించే ప్రమాదాలు పొంచి ఉన్నాయని అంటున్నారు.



**రక్తపోటు :** జిల్లాలో 18 ఏళ్ల పై బడిన వారిలో సంగటున 20 శాతం మంది అధిక రక్తపోటు బాధితులే ఉన్నట్లు తెలుస్తోంది. దీర్ఘ కాలికంగా ఒత్తిడి, శరీరక శ్రమ లేకపోవడం, వంశపారంపర్యంగా అధిక రక్తపోటుకు గురవుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేస్తోంది. అధికరక్తపోటుతో బాధపడుతున్న వారు దీర్ఘకాలికంగా మందులు వాడుతున్నారు.

**ప్రతీ పది మందిలో ఒకరు :** మధుమేహం అనేది ఒకప్పుడు వయస్సు మళ్లిన తర్వాత వచ్చే వ్యాధని, ఎక్కడో ఒకచోట వంశ పారంపర్యంగా తక్కువ వయస్సు గల వారిలో వస్తుందని వినిపించేది. కానీ ఇప్పుడు ప్రతీ పది మందిలో ఒకరికి మధుమోహం వ్యాధి గ్రస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా అధిక మొత్తాల్లో షుగర్ మందుల విక్రయాలే ఇందుకు ఉదాహరణ. ఎక్కువగా మత్తునిచ్చే పానియాలు తాగడం, నిద్ర మేలి, ఆహారపు అలవాట్లలో మార్పులు వంటివాటితో షుగర్ భారిన పడుతున్నారు. వీరు జీవన శైలితో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పులువురు వైద్యులు చెబుతున్నారు. రానున్న దశాబ్ద కాలంలో ఈషుగర్ వ్యాధి క్రస్తులు 50శాతం పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో శారీరక శ్రమ తగ్గడంతో రకరకాల వ్యాధులు వస్తున్నాయి. ముఖ్యంగా టివిలు, సెల్ ఫోన్లతో గంటల తరబడి కాలక్షేపం చేయడంతో పాటు ఆహారం తీసుకోవడంలోనూ పలుమార్పులు చోటు చేసుకున్నాయి. ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్, హోటల్ కల్చర్‌కు అలవాటు పడి రోజుల తరబడి నూనెలో బాగా వేయించిన (ఫ్రై) ఆహారాలకు అలవాటుపడి షుగర్ వ్యాధి భారిన పడటమే కాకుండా కొన్ని సందర్భాల్లో జీర్ణాశయ క్యాన్సర్ భారిన పడుతున్నారు.

**అయోడిన్ ముప్పు :** జీవన క్రియలకు అవసరమైనవాటిలో అయోడిన్ ఒకటి. ఈ అయోడిన్ లోపంతో థైరాయిడ్, బుద్ధి మాంద్యం, స్త్రీలలో గర్భస్రావం, అలసట, చిరాకు, కోపం వంటి పెరుగుతాయి. అయోడిన్ లోపంతో థైరాయిడ్ గ్రంధి పనితీరు తగ్గుతుంది. ఇది జీవన క్రియల మీద ప్రభావం చూపుతుంది. ఫలితంగా మెడ భాగంలో ఉబ్బెత్తుగా మారుతుంది. కొన్నిసందర్భాల్లో ఇది ప్రాణాపాయ స్థితికి చేర్చే అవకాశం లేకపోలేదు. రాత్రి సమయం వరకు సెల్ ఫోన్‌తో గడపడంతో పాటు అయోడిన్ తగిన మోతాదులో లేని పదార్థాలను తీసుకోవడంతో థైరాయిడ్ భారిన పడుతున్నారు. వీటితో పాటు తగినంత నీరు తాగకపోవడంతో కిడ్నీ సంబంధిత వ్యాధిభారిన పడుతున్నారు. డయాలసిస్ చేయించుకునే వారిలో ఎక్కువగా యువతే ఉండటం గమనార్హం. జీవన శైలిలో మార్పుకు నిత్యం అరగంట నుండి గంటపాటు వ్యాయామం, శారీరక శ్రమ, నడక లాంటివి చేస్తే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చు. ఒత్తిడితో కూడిన జీవన విధానాన్ని, శరీరానికి హాని తలపెట్టే ఆహారపు అలవాట్లు మార్పు చేసుకోకుంటే పిన్న వయస్సులోనే తనవులు చాలింటే అవకాశం లేకపోలేదని వైద్యారోగ్య శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# దుమ్ముతో పోరాటం... ఆగని ప్రయాణం

**-ప్రమాదస్థాయికి చేరిన మండల ప్రజల ఆరోగ్య పరిస్థితి**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఫోర్ వే లైన్ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా రోజంతా ఎగిరే దుమ్ముతో గ్రామ మొత్తం కమ్ముకుపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు, ట్రక్కులు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల మట్టి రోడ్లపై దుమ్ము మేఘాలు ఎగసిపడుతున్నాయి. దీంతో గ్రామంలోని ఇళ్లలో, దుకాణాల్లో దుమ్ము పేరుకుపోతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాస కోస సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దుమ్ము కారణంగా దగ్గు, అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇళ్ల ముందు కూర్చోవడం కూడా కష్టంగా మారిందని మహిళలు అంటున్నారు. అటు పిల్లల పరీక్షలు పెళ్లిళ్లు వివిధ కారణాలతో మండల కేంద్రంలో రద్దీగా ప్రయాణాలు సాగుతున్నప్పటికీ చేసేదేమీ లేక దుమ్ముతో పోరాటం చేస్తూ ప్రయాణాలను సాగించడం తప్పని సరి అయిపోయింది. ఈ సమస్యలపై సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనులు పూర్తయ్యే వరకు రోజుకు కనీసం రెండు మూడు సార్లు నీరు చల్లి దుమ్ము తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. గుత్తేదారు నీళ్లు చల్లించకపోవడం వల్ల అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటంతో చేసేదేమీ లేక ఎవరి ఇంటి ముందు వాళ్లే స్వయంగా పైపులతో నీళ్లు పట్టుకుంటున్నారు. అయినాప్పటికీ ఎండ తాపం వల్ల నీరు ఆవిరైపోవడంతో యధా పరిస్థితి చేరుకుంటుంది. అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఫోర్ వే లైన్ రోడ్డు నిర్మాణం అభివృద్ధికి దోహదపడతుందని ప్రజలు చెబుతున్నప్పటికీ, పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## దీర్ఘకాలిక వ్యాధులకు చక్కని పరిష్కారం హోమియో


**-మెగా హోమియో క్యాంపు ప్రారంభించిన డిఎంహెచ్ఓ**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** దీర్ఘకాలిక, మొండి వ్యాధులకు చక్కని పరిష్కారం హోమియో వైద్యం చక్కని పరిష్కారమని హోమియో ప్రాంతీయ సంచాలకులు ప్రమీల తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ హోమియో దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని మామిళ్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మెగా హోమియో ఆరోగ్య శిబిరం విజయవంతంగా శుక్రవారం ముగిసింది. ముందుగా ఈ క్యాంపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి రామారావు ప్రారంభించారు. సందర్భంగా ప్రాంతీయ సంచాలకులు మాట్లాడుతూ హోమియోపతి వైద్య విధానాన్ని డాక్టర్ సామ్యూయెల్ హానెమన్ ఆవిష్కరించారని, ఇది సదృశ్యం సదృశ్యంతోనే నయం అవుతుంది అనే సూత్రంపై ఆధారపడిన వైద్య విధానం అని తెలిపారు. సీనియర్ హోమియో వైద్యధికారులు పద్మావతి, ఉపేందర్, సుధాకర్, జ్యోతి, నస్రీన్, ప్రవీణ్, వెంకటలోస్‌లు వైద్యసేవలందించారు.

# భానుడు భగభగ.. ప్రజలు విలవిల..

**పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు - కొబ్బరి బోండాలు, శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ**







**ప్రజాపక్షం/కరకగూడెం :** వేసవికాలం రానే వచ్చింది. సూరీడు భగభగమంటూ సెగలు కక్కుతున్నాడు. మండల వాసులు ఉక్కపోతతో అల్లాడుతు న్నారు. కరకగూడెం మండలంలో పగటి ఉష్ణోగ్రతలు పెరగటంతో, ఉదయం గం. 11.00లకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు కొబ్బరి బోండాలు, జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. మండలంలో గత సంవత్సర కాలంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో నిండిన చెరువులు సైతం ఎండల కారణంగా ఇప్పటికే ఇంకిపోతున్నాయి. ప్రజలు ఎండల తాకిడికి ఉదయం గం. 11.00లకే ఇళ్ళకు వెళ్ళిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాయంత్రం గం. 5.00ల వరకు జనం రోడ్ల మీదకు వచ్చేందుకు జంకుతున్నారు. కూలీ పనులు, చిరు వ్యాపారులు, ఉపాధి కూలీలు ఎండలకు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు.

### గ్రామాల్లో ఏర్పడిన నీటి కొరత...

వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో నీటి కొరత ఏర్పడింది. గ్రామ పంచాయితీలలో త్రాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. త్రాగునీటి కొరతతో పాటు పశు పక్ష్యాదులకు తాగేందుకు నీరు లేకపోవడంతో చెరువుల బాట పడుతున్నాయి. చెరువుల్లో కూడా అంతంత మాత్రం గానే నీటి సౌకర్యం ఉండటంతో పశువులపై జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని వెటర్నరీ వైద్యులు విజ్ఞప్తి చేశారు.శీతల పానీయాలకు పెరిగిన గిరాకీవేసవి సమీపించడంతో మండల పరిధిలోని ప్రజలు కొన్ని శీతల పానీయములు దుకాణముల ముందు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా చేసుకుంటున్న శీతల పానీయాల వ్యాపారులు రంగు రంగుల ఫ్లెక్సీ లతో వినియోగదారులను ఆకర్షిస్తూ ఆరోగ్యానికి హానికరమైన కెమికల్స్‌తో తయారుచేస్తున్నారనే ఆరో పణలు వస్తున్నాయి. కావున ప్రజలు రంగులను చూసి మోసపోకుండా ఆరోగ్యానికి మేలు చేసే పలు పోషకాలు ఉన్నటువంటి పండ్ల రసాలను, కొబ్బరి నీళ్ళను సేవించాలని వైద్యులు సూచిస్తున్నారు.

### కొబ్బరి బోండాలు, పుచ్చకాయలకు పెరిగిన గిరాకీ...

వేసవి తాపం పెరగటంతో కొబ్బరి బోండాలకు, పుచ్చకాయలకు డిమాండ్ పెరిగింది. గత ఫిబ్రవరి నెల వరకు కొబ్బరి నీళ్ళు లీటర్ రూ.100/లు, రూ. 110/లు ఉండగా ప్రస్తుతం రూ. 150/ల నుంచి రూ. 160/ల వరకు విక్రయిస్తున్నారు. పండ్ల రసాలు, సన్నారి, షరబత్లు సేవించేందుకు జ్యూస్ షాపుల ముందు క్యూ కడుతున్నారు.

### చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి...

వ్యాపార లావాదేవీల నిమిత్తం, అధికారులతో ఉన్న పని కోసం ప్రజలు పట్టణానికి వస్తుంటారు. ఈ క్రమంలో దంచి కొడుతున్న ఎండలు, ముదిరిపోతున్న ఉక్కపోత దృష్ట్యా రద్దీ ఎక్కువగా ఉండే వ్యాపార సముదాయల దగ్గర చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పెరిగిన ఎండలతో భరించలేక పోతున్న పలువురు ప్రజలు కోరుతున్నారు.

# రజబ్ అలీ ఆశయ సాధన కోసం ఉద్యమిద్దాం

- చట్ట సభలో పేద గొంతుకైన రజబ్‌అలీ
- భూస్వామ్య అరాచకాలను ఎదిరించిన పోరాట యోధుడు
- సామ్య ప్రజల కోసం జీబితాన్ని త్యాగం చేసిన మహనీయులు




**ప్రజాపక్షం/పాల్వంచ :** అమరజీవి మహమ్మద్ రజబ్ అలీ ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త ఉద్యమించాలని అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎంఎల్‌ఏ మహమ్మద్ రజబ్ అలీ 30వ, వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రజబ్‌అలీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ రజబ్ అలీ తన కుటుంబం కంటే పేద ప్రజల శ్రేయస్సు కోసమే ఎక్కువగా పరితపించిన నాయకుడన్నారు. సుజాతనగర్ నియోజకవర్గ ఎంఎల్‌ఏగా సుదీర్ఘ కాలం పనిచేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటుగా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల్లో ఒకరిగా, తమ వాడిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి రజబ్ అలీ అని కొనియాడారు. ఆదర్శవంతమైన రాజకీయాలను కొనసాగించిన ఆయన జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి తరం నాయకులు తమ కార్యాచరణ సాగించాలని ఆకాంక్షించారు. పదవుల కోసం కాకుండా సామాన్యుల కోసం పోరాడిన ప్రజానేత అని కొనియాడారు. రజబ్ అలీ ఆశించిన మార్పులు సమాజంలో ఇంకా రాలేదని వాటి కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు గుర్రం వెంకటేశ్వర్లు, వీసంశెట్టి విశ్వేశ్వర్ రావు, జిల్లా సమితి సభ్యులు వీ. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఎస్‌ఏ. రహమాన్, గౌతమి క్రిష్ణ, వైఎస్ గిరి, ఆలపాటి ప్రసాద్, గొర్లె నరేష్, రామదాసు, రమేష్, నాగేశ్వరరావు, సత్యానారాయణ, అల్లి వెంకటేశ్వర్లు, ఆవుల సతీష్, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ భవనం కోసం తహశిల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ప్రెస్‌క్లబ్ భవనం కోసం పట్టణంలోని జర్నలిస్టులంతా ఏకమై తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లుకు వినతి పత్రాని అందజేశారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో క్లబ్ భవనం, సమావేశపు మందిరం అవసరపై ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహశిల్దార్ ప్రభుత్వ స్థలం కేటాయింపుపై సాధ్యమైనంత త్వరలో అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ సబ్ సెంటర్‌కు వాటర్ డిస్పెన్సర్ వితరణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల పరిధిలోని చీమలపాడులో గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(హెల్త్ సబ్ సెంటర్)కు బాజుమల్లాయిగూడెంనకు సర్కిల్ ఇన్స్పెక్టర్(సీఐ)పోతుల శ్రీధర్ తన తాతయ్య పోతుల నారాయణ జ్ఞాపకార్థం ఎలక్ట్రిక్ వాటర్ డిస్పెన్సర్ వితరణగా ఇచ్చారు. సీఐ శ్రీధర్ తండ్రి పోతుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సబ్ సెంటర్ సిబ్బందికి శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ఆసుపత్రులలో రోగులు, సందర్శకులు, సిబ్బందికి సురక్షితమైన త్రాగునీటిని అందించడానికి వాటర్ డిస్పెన్సర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉద్దేశంతో అందజేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారి అవసరాన్ని బట్టి చల్లని, గోరువెచ్చని, సాధారణ నీటిని అందించే వీలుగా డిస్పెన్సర్ పని చేస్తుందన్నారు. తాను పుట్టి పెరిగిన స్వగ్రామానికి సామాజిక సేవలో భాగంగా వైద్య సిబ్బంది సూచన మేరకు డిస్పెన్సర్ వితరణగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ బంధం జ్యోతిలక్ష్మి, ఎంఎల్ హెచ్పి కళ్యాణి, ఏఎన్ఎం ఉష, గ్రామస్తులు దుబ్బాక్కుల శేఖర్, పోతుల నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

## పినపాకలో పోస్టల్ సబ్ ఆఫీస్ ప్రారంభం



**ప్రజాపక్షం/పినపాక:** మండల కేంద్రంలో పోస్టల్ సబ్ ఆఫీస్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ఐపిఓ రామ్మూర్తి హాజరు కాగా, స్థానిక సర్పంచ్ అలివేలు పోస్టల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అలివేలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నూతన పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఈకార్యాలయం ద్వారా ప్రజలకు పోస్టల్ సేవలు మరింత చేరువవుతాయని, ముఖ్యంగా వృద్ధులు, రైతులు, విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలు, సేవింగ్స్ ఖాతాలు, మనీ ఆర్డర్ వంటి సేవలు సులభంగా అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పోస్టల్ సబ్ ఆఫీస్ ప్రారంభంతో పినపాక మండల ప్రజలకు సేవలు మరింత విస్తరించనున్నాయి.

## ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కు జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతీ గ్రామంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వేసవి లో తాగునీటి ఎద్దడి రాకుండా గ్రామాలలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్యాస్ వినియోగదారుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. గ్యాస్ బ్లాక్ దందా ను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షుడు పసుమర్తి శ్రీనివాస్, కోశాధికారి కనకపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో బడిబాట కార్యక్రమం




**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రొ జయశంకర్ బడిబాట ప్రత్యేక నమోదు ప్రచారం నిర్వహించారు. ప్రధాన కూడలిలో దుకాణదారులు, వాహనదారులు, ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ వేముల నరేష్ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రతి విద్యార్థిని చేర్పించాలని పిలుపునిచ్చారు. గ్రామ పెద్ద వేముల రమణ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ప్రయోజనాలను వివరించారు. ఈకార్యక్రమంలో బసవయ్య, షైక్ దస్తగిరి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, బాబురావు, వెంకటేశ్వరరావు, సుశీల, పద్మ, దుకాణ యాజమానులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి బదిలీ



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ సంపత్ బదిలీ అయ్యారు. హై కోర్టు ఆయనను నల్గొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్ సరితకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వరంగల్ మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత భద్రాద్రి కొత్తగూడెం న్యాయమూర్తిగా రానున్నారు.

# అజరామరుడు మహ్మద్ రజబ్‌అలీ

**-ఆశయ సాధనకు పునరంకితమవుదాం**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల అభ్యున్నతి కోసం, సమాజాభివృద్ధి కోసం పనిచేసిన మహ్మద్ రజబ్‌అలీ అజరామరుడని సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఆయన పేరు నిలిచి ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ప్రజాప్రతినిధిగా పనిచేసిన రజబ్‌అలీ ఆదర్శంగా నిలిచారన్నారు. రజబ్‌అలీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మహ్మద్ రజబ్‌అలీ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన ప్రభుత్వ ఉద్యోగం తృప్తినివ్వలేదని కొంత కాలం ప్రభుత్వ ప్రెస్‌లో అనువాదకునిగా పనిచేసిన రజబ్‌అలీ ఆ తర్వాత ఆంధ్రమహాసభలో చేరారని సురేష్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు చారిత్రిక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. ఖమ్మంలో రైలు పట్టాల ఉద్యమానికి రజబ్ అలీ నేతృత్వం వహించారని తెలిపారు. నాగార్జున సాగర్ సాధనోద్యమంలోనూ పనిచేశారన్నారు. సాయుధ పోరాట కాలంలో తుపాకీ పట్టి పోరాడిన ఆయన సుమారు ఐదేండ్ల పాటు జైలు జీవితం గడిపారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, జిల్లా కార్యవర్గ సభ్యునిగా, శాసనసభ పక్ష నేతగా, బహుముఖ పదవులలో పనిచేసి ఆయన వన్నెతెచ్చారన్నారు. ఆరు సార్లు శాసనసభ్యునిగా ఎన్నికై శాసన సభలో తన గళాన్ని పేద ప్రజల కోసం విప్పారన్నారు. పేదలకు ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్న తొలి ప్రతిపాదన మహ్మద్ రజబ్‌అలీదేనన్నారు. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రజబ్‌అలీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సురేష్ పిలుపునిచ్చారు. ఒకపక్క పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు, మరో పక్క పెరుగుతున్న ఆర్థిక అంతరాల నడుమ సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని సురేష్ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నేతృత్వాన ప్రజా పోరాటాలు కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, వై. సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, కె. శ్రీనివాసరావు, ఎస్‌కె సైదా, మోహన్‌రావు, నాయకులు నంబూరి శంకర్‌రావు, యాకయ్య, దుర్గానాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థపరుడు రజబ్ అలీ

**సిపిఐ నేతలు యర్రాబాబు, దొండపాటి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** సిపిఐ సీనియర్ నాయకులు, ఆరుసార్లు శాసన సభ్యులుగా ఎన్నికైన అమరజీవి కామ్రేడ్ రజబ్‌అలీ నిరాడంబరంగా నిస్వార్థంగా నిత్యం ప్రజల్లో మమేకమై ప్రజానాయకుడిగా ప్రజలమనస్సుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నాడని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు యర్రా బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు అన్నారు. స్థానిక దొండపాటి భవన్‌లో శుక్రవారం రజబ్‌అలీ 30వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు భూమి లేని నిరుపేదలకోసం పోరాడారని, పోడుభూములు కొట్టుకున్న పేదలకు అండగా నిలబడి భూములు సాగుచేసుకోవడానికి పెద్దన్నగా నిలబడ్డారని తెలిపారు. ఆయన చనిపోయేవరకు కనీసం సొంత ఇల్లుకుండా నిరాడంబరంగా బతికారని పేర్కొన్నారు. మచ్చలేని ప్రజానాయకుడని కొనియాడారు. నేటి తరం నాయకులు ఆయన అడుగుజాడల్లో పయనించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజాప్రతినిధులుగా అలాంటి నిజాయితీ పరులైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పాపగంటి సుదర్శన్, స్వర్ణ రమేష్, మనిగె కోటేశ్వరరావు, అచ్చన శ్రీనివాసరావు, కట్ల సత్యం, కంపసాటి వెంకన్న, వెంపటి పరుశురాములు, యాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 32 కెవి విద్యుత్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

**తమ గ్రామంపై నుండి విద్యుత్ లైన్ వద్దంటూ ఆందోళన**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తమ గ్రామంపై నుండి ప్రమాదకరమైన 32 కెవి విద్యుత్ లైన్ వద్దంటూ ఆందోళనకు దిగారు గ్రామస్తులు. ఇప్పటికే మీ కంపెనీ వల్ల మా కుటుంబాలు నరకం అనుభవిస్తున్నాయని, అది చాలదన్నట్లు మరలా ఈ శాపం మాకెందుకంటూ మండి పడ్డారు. మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో ఏర్పాటు చేసిన సింగరేణి ఉన్నతాధికారుల వసతి గ్రహాలకు ఆ గ్రామం లోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ మీదుగా 32 కెవి విద్యుత్ లైన్ ఏర్పాటుకు సింగరేణి అధికారులు ప్రణాళికలు రచిస్తుండగా, ఆ ఏర్పాట్లను తక్షణమే నిలిపివేయాలని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పనులను గురువారం రాత్రి అడ్డగించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తమపై కక్ష కట్టిందని, తమ నివాస గృహాలను టార్గెట్ చేసి తమ కార్యకలాపాలు కొనసాగిస్తుందని ఆరోపించారు. సింగరేణి వసతి గృహాలకు కిష్టారం గ్రామం మీదుగా నిర్వహిస్తున్న 32 కె.వి విద్యుత్ లైన్ ను గ్రామసభ నిర్వహించి వ్యతిరేకించినప్పటికీ సింగరేణి యాజమాన్యం ద్వంద చర్యలకు పాల్పడి దిశను మార్చి తమ కాలనీ మీదుగా నిర్మిస్తున్నారని బీసీ కాలనీవాసులు ఆరోపించారు. గతంలో సింగరేణి యాజమాన్యం తమ కాలనీకి అతి సమీపాన ప్రజాభిప్రాయ సేకరణతో పని లేకుండా షైలో బంకర్ నిర్మించి అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైందని, ఈ విషయంపై పలుమార్లు నిరసనలు చేపట్టినప్పటికీ సింగరేణి యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రస్తుతం కిష్టారం గ్రామం లో సింగరేణి అధికారులకు ఏర్పాటు చేసిన విలాసవంతమైన వసతి గృహాలకు అధిక సామర్థ్యం కలిగిన విద్యుత్ తీగలను తమ నివాస గృహాల మీదుగా వెళ్ళనిచ్చే ప్రసక్తే లేదని హెచ్చరించారు. షైలో బంకర్ కాలుష్యంతో ప్రాణాలు పోతున్నాయని,ఇప్పుడు విద్యుత్ తీవ్రతకు గురి చేయడానికి సన్నాహాలు చేపట్టిందని దుయ్యబట్టారు. తమ కాలనీ మీదుగా నిర్మిస్తున్న 32 కె.వి విద్యుత్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, ఇండ్లపై నుండి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొత్త సాంబయ్య, కిష్టపాటి కోటిరెడ్డి, జాన్ బి, చంద్రం, కందె సత్యం, నారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్‌పాస్ నిర్మాణానికి రూ.34కోట్లు మంజూరు

**- డిప్యూటీ సిఎం భట్టికి కృతజ్ఞతలు తెలిపిన పట్టణ ప్రజలు**



**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలో రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ పడింది. దశాబ్దాల కాలంగా మధిర అభివృద్ధికి ఆటంకంగా మారిన రైల్వే ట్రాక్‌కు అండర్ పాస్ నిర్మాణంతో వ్యాపార వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాల హామీగా మిగిలిన రైల్వే అండర్‌పాస్ నిర్మాణం డిప్యూటీ సిఎం మల్లు భట్టి చొరవతో నిధులు మంజూరు కావడంతో పట్టణ ప్రజల కష్టాలు తీరనున్నాయి. గత ఏడాది మూడోలైన్ నిర్మాణం సమయంలో ప్రజల నిరసన పోరాటానికి స్పందించిన డిప్యూటీ సిఎం ఆదేశాలతో తాత్కాలికంగా గోడ నిర్మాణం మధ్యగా రైల్వేశాఖ నడకదారికి అనుమతించింది. ఆ రోజే అండర్‌పాస్ నిర్మాణానికి సానుకూల స్పందన ఇస్తూ స్థలఎంపిక చేయాలని డిప్యూటీ సిఎం భట్టి అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీ నుండి క్లియరెన్స్ దస్త్రంకు డిప్యూటీ సిఎం చొరవతో సేతు బంధన్ పథకం ద్వారా అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.34కోట్లు నిధులు మంజూరు చేసింది. రైల్వే అండర్‌పాస్ నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలకు మార్గం సులువు కానుండడంతో పట్టణంలో వర్తక వ్యాపార వర్గాలకు మేలు జరుగనున్నది. మధిర పట్టణ ప్రజలను ఎంతో కాలంగా పట్టిపీడిస్తున్న రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కకు మధిర పట్టణ ప్రజలు, వ్యాపార వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సాగర్‌కాల్వలో పది విద్యార్థి గల్లంతు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి వద్ద గల సాగర్‌కాల్వలో పదవతరగతి విద్యార్థి గల్లంతైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఏదులాపురానికి చెందిన పుట్టబంతిని నాగయ్య విజయకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పుట్టబంతిని రామకృష్ణ (16) పదవతరగతి చదువుతున్నాడు. పరీక్షల నేపథ్యంలో ఏదులాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్నాడు. అటూ తర్వాత మధ్యాహ్నం సమయంలో స్నేహితులతో కలిసి చెరువులో ఈతకు వెళ్లారు. అందులో ఓ మిత్రుడి బర్త్‌డే ఉండటంతో అక్కడే కేక్‌ను కట్ చేపించారు. ఈ క్రమంలో విద్యార్థులు మద్యం సేవించినట్టుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదం జరిగి ఉండవచ్చునని పేర్కొంటున్నారు. కాగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటన స్థలం వద్దకు చేరుకొని పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. సదరు విద్యార్థి పదిపరీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. ఈ ఘటనలో నెలకొన్న నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదహారు సంవత్సరాల వారికి మందు ఎలా? వచ్చిందని, స్కూల్ ఉపాధ్యాయులు ఎందుకు పర్యవేక్షణ చేయలేదనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

# విజయలో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆవిష్కార్ 2కె 26 రెండు రోజులు నిర్వహించే జాతీయస్థాయి సాంకేతిక సదస్సు వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్‌పర్సన్ పారుపల్లి విజయలక్ష్మి మాట్లాడుతు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి సదస్సులు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులకు తమ కళాశాలలో అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకొని మంచి మార్కులు సాధించి మంచిస్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోకూడా చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. సాంకేతిక, సాంస్కృతిక పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినవారికి ఈ రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషాతరుణం, డీన్ డాక్టర్ డి శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్‌బాబా, డాక్టర్ పి హరిప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా హోమియో పితామహుడు జయంతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల ప్రభుత్వ హోమియో వైద్యశాలలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ సామెల్‌క్రిస్టియన్ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని తల్లాడ హోమియోపతి డాక్టర్ నీలిమ, తల్లాడ సర్పంచ్ పి.నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరై డాక్టర్ హనుమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో యోగా అనేది ఒక ముఖ్యమైన ప్రక్రియ అని, హోమియోపతి వైద్యాన్ని మండల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరరావును వైద్యశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో యోగా శిక్షకులు అహ్మద్ గౌతమి, రామ్ ప్రసాద్, జానీబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/ తల్లాడ :** గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని ఎంపిడిఓ అంబటి శ్రీధర్‌రాజు అన్నారు. తల్లాడలో రెండవ విడత వార్డు సభ్యుల శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు పర్యావరణ హితమైన జ్యూట్ బ్యాగులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో రైతు మృతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం రామచంద్రపురం గ్రామంలో పులి సత్యనారాయణ అనే రైతు వడదెబ్బతో మృతి చెందారు. శుక్రవారం రోజువారీ వ్యవసాయ పనుల్లో భాగంగా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి వచ్చిన పులి సత్యనారాయణ ఎండ తీవ్రతను తట్టుకోలేక ఒకేసారి కుప్పకూలిపోవడంతో చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులు హాస్పటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే సత్యనారాయణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వడదెబ్బతో అకాల మృతి చెందిన సత్యనారాయణ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# డిజిటల్ సాంకేతికతో అంగన్ వాడీ సేవలు మరింత మెరుగు

**- మంత్రి సీతక్క**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** డిజిటల్ సాంకేతిక సేవలతో అంగన్వాడీ సేవలు మరింత మెరుగు పడతాయని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శుక్రవారం ఐడిఓసిలో పోషన్ పక్వాడ కార్యక్రమం ప్రారంభోత్సవంతో పాటు అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేవలు మరింత సమర్ధవంతంగా అందించేందుకు స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల బరువు, పోషకాహార వివరాలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా సేవల నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని, వేతనాల పెంపుపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల అంగన్వాడీ ఖాలీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1954 స్మార్ట్ ఫోన్లు అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్నామని చెప్పారు. 2061 కేంద్రాల్లో విద్యుదీకరణ పనులు పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పినపాక, అశ్వారావుపేట ఎంఎల్ఏలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, అధికారులు లెనినా, నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలి

**- డీఆర్డీవో కొండపల్లి శ్రీరామ్**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల కూలీల సంఖ్యను మరింత పెంచాలని డీఆర్డీవో కొండపల్లి శ్రీరామ్ సూచించారు. మండలం లోని చెరువుమాధారం లో శుక్రవారం పర్యటించారు. తొలుత స్థానిక నర్సరీ ని సందర్శించారు. మొక్కల సంరక్షణ కు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కూలీలతో ముచ్చటించారు. పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మస్టర్ ను తనిఖీ చేశారు. కూలీలకు స్వయంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతీ రోజు 12 వేల మంది వరకు కూలీలు పనులను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా కూలీల సంఖ్య ను పెంచాలని సూచించారు. ఎండ తీవ్రత వలన ఉదయం 6.30 గంటలకు ప్రారంభించాలని సూచించారు. పని ప్రారంభించిన నాలుగు గంటల తరువాత రెండో ఫోటో తీయాలని సూచించారు. పథకం నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కూలీలు ఎండ దెబ్బ తగలకుండా నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 115 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 85 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన కేంద్రాలు రెండు రోజులలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యల్లయ్య, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఏపిఎం సురేందర్, సీసీ వెంకటేష్, ఈసీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# బొక్కలతండా ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్కూల్ డే వేడుకలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** బొక్కలతండా ప్రాథమిక పాఠశాలలో స్కూల్ డే సెలబ్రేషన్(ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం)ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం ప్రధానోపాధ్యాయులు వాంకుడోత్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి మండల విద్యాశాఖ అధికారి జయరాజు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సర్పంచ్, పాఠశాల ఛైర్మన్, తల్లిదండ్రులు కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే 2026,27 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను ప్రభుత్వం అందజేయనున్నదని, అదే విధంగా అల్పాహార సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరిని అలరించారు. ఈకార్యక్రమంలో బొక్కలతండా గ్రామ పంచాయితీ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు, కోమట్లగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శారద, పాఠశాల ఉపాధ్యాయులు వాంకుడోత్ మంగీలాల్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రజినీకుమారి, ఉపాధ్యాయులు సుక్రు, ఎమ్మార్సీ సిబ్బంది వాంకుడోత్ మోతిలాల్, భూక్య విజయ కుమార్, సిఆర్‌పి పరమేష్, రాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మల్సూర్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**అంజనాపురం గ్రామ పంచాయితీలో బానోత్ రాజేందర్ తండ్రి బానోత్ మల్సూర్ దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గంపాడు మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు హాజరై, మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామ కమిటీ అధ్యక్షులు పోతిరెడ్డి గోవిందరెడ్డి, అంజనాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు శ్యామ్, ఉప సర్పంచ్ ఇస్లావత్ రవికుమార్, వార్డు సభ్యులు పవన్ కుమార్, ముని, టెలిఫోన్ రాము, సీతారాములు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

### మృతి చెందిన బుర్ర లింగయ్య కుటుంబానికి పరామర్శ....

నకిరిపేట గ్రామ పంచాయితీ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుర్ర లింగయ్య కుటుంబ సభ్యులను బూర్గంపాడు మండల మాజీ జెడ్పిటిసి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో బొల్లా వెంకన్న, కెలావత్ శివ, కృష్ణ, తాటి సారయ్య, దాసరి వెంకన్న, శ్రీను, రమేష్, మల్లయ్య, బానోత్ కిట్టు, వికాస్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సేఫ్టీ యాక్షన్ ప్లాన్ పై సమీక్షా సమావేశం




**ప్రజాపక్షం/జూలూరుపాడు :** భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జూలూరుపాడు మండల పరిధిలోలోని 24 గ్రామ పంచాయతీలలో రోడ్ సేఫ్టీ చర్యలను సమర్థవంతంగా అమలు చేయుటకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో అమలు చేయవలసిన రోడ్ సేఫ్టీ యాక్షన్ ప్లాన్ (ఏప్రిల్ 13 నుండి 18 వరకు) ముఖ్యంగా కింది అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీ నుండి రోజువారీ నివేదికలు సమర్పించుటతో పాటు కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు పంపించవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను రక్షించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో తాళ్లూరి రవి, తహశీల్దారు శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్ రవి, మండల విద్యాధికారి జుంకిలాల్, మండల పరిషత్ ఏఈ కార్తీక్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు, డాక్టర్ వెంకటేశ్వరరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ మరియు కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెగిన చెవి ఆపరేషన్ విజయవంతం

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ప్రమాదవశాత్తు తగిలిన గాయంతో చెవి శరీర భాగం నుండి వేరు కాగా ఆ చెవికి నేపుణ్యంతో ఆపరేషన్ చేసిన వైద్యులు విజయం సాధించారు. వివరాల ప్రకారం, చుంచుపల్లి మండలం రామవరం గ్రామానికి చెందిన నిర్మల తీవ్రమైన గాయంతో గురువారం రాత్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన ఇఎన్‌టి విభాగం వైద్యులు చెవిభాగం పూర్తిగా వేరైపోవడాన్ని గమనించారు. ఇఎన్‌టి డా, శ్యామ్‌సన్ ఆధ్వర్యంలో బృందం తెగిపోయిన చెవిభాగాన్ని అతికించేందుకు శస్త్రచికిత్సలు నిర్వహించి విజయం సాధించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

**అభినందించిన కూనంనేని :** కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి వైద్యులు పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ క్లిష్టమైన ఆపరేషన్లను సైతం హైయ్యర్ సెంటర్లకు రిఫర్ చేయకుండా ఇక్కడే నైపుణ్యంతో చేస్తున్నారని, రామవరానికి చెందిన నిర్మల చెవి తెగిపడిపోయినప్పటికీ ఆ తెగినపోయిన చెవికి చాకచక్యంగా ఆపరేషన్ చేసి విజయం సాధించడం గర్వించతగ్గ విషయమని, అపరేషన్ విజయవంతం చేసిన వైద్యబృందం నిజంగా అభినందనీయులు అన్నారు. అలా అనేక కేసులను విజయవంతంగా నిర్వహిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని, ఇలాంటి వైద్య సేవల వల్ల ప్రభుత్వాస్పత్రులపై పేదలకు నమ్మకం పెరుగుతుందన్నారు. ఇక ముందు కూడా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి మరింత మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కూనంనేనితో పాటు పలువురు వైద్య బృందాన్ని అభినందిస్తున్నారు.

# గోపే ఈశ్వర్ హఠాన్మరణం బాధాకరం



**ప్రజాపక్షం/కూసుమంచి:**కూసుమంచి మండల కేంద్రానికి చెందిన యువకుడు గోపే ఈశ్వర్ హఠాన్మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈశ్వర్ మృతి పట్ల బీజేపీ జిల్లా నాయకులు గుండాల ఉపేందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపే ఈశ్వర్ మృతి వార్త అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అందరితో స్నేహపూర్వకంగా, కలివిడిగా ఉంటే ఈశ్వర్ అకస్మాత్తుగా దూరమవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో మంద చంద్రశేఖర్ గౌడ్, నరేష్, అఖిల్, గురువయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన పొంగులేటి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలం లో శుక్రవారం పర్యటించారు. మండలం లోని కోనాయిగూడెం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నాయకురాలు పాకనాటి సంగీత ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సిలివేరు సీతారావమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేలకొండపల్లి, గువ్వలగూడెం, నాచేపల్లి, కట్టుకాచారం తదితర గ్రామాలలో పర్యటించారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, పెంటమళ్ల పుల్లమ్మ, గుండపనేని లక్ష్మణరావు, తిగుళ్ల భవాని, పాకనాటి కన్నారెడ్డి, మరికంటి రమేష్,గండు సైదులు,పెద్దపాక సైదులు, గోపి ఉపేందర్, మల్లెబోయిన శ్రీనివాస్ రావు, చెరుకుపల్లి వెంకటమ్మ, కొత్తపల్లి వీరమ్మ, వుల్లోజి ప్రభుదాసు, మందడి నాగశ్రీను పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:**మోతే చింతకుంట గ్రామంలో 2025డిసెంబర్ నెలలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈవిషయంపై బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మోతే గ్రామానికి చెందిన కుంజం లక్ష్మయ్య ఇంట్లో జరిగిన దొంగతనంపై కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తును వేగవంతం చేయడం జరిగిందన్నారు. కుక్కునూరు మండలం ఉప్పేరు గ్రామానికి చెందిన కుమ్మరపల్లి రాజేష్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన పోకో సెల్‌ఫోన్‌తో పాటు దొంగతనానికి ఉపయోగించిన పల్సర్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులు తమ నిబద్ధత, అప్రమత్తతను మరోసారి చాటారు. ప్రజల ఆస్తి భద్రతకు కట్టుబడి ఉన్న పోలీసులు ఇలాంటి చర్యల ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తున్నారు.

# ట్రంప్ దురహంకారానికి గుణపాఠం

**-అంతర్జాతీయంగా ప్రాముఖ్యతను కోల్పోయిన భారత్**
**-సిపిఎం ప్లీనరీలో తమ్మినేని**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అమెరికా అధినేత ట్రంప్ దురహంకారానికి ఇరాన్ సరైన గుణపాఠం చెప్పిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదానికి ఇరాన్ సరైన గుణపాఠం చెప్పిందని ఆయన అన్నారు. సిపిఎం జిల్లా స్థాయి ప్లీనరీ శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఇరాన్ పాలక వర్గం మీద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యాహు కక్ష పూరితంగా వ్యవహరించారని ఆయన తెలిపారు. ఒకప్పటి హిట్లర్ లాగా దేశ నాగరికతనే ధ్వంసం చేస్తానని ఇరాన్‌ను హెచ్చరించడం అనాగరిక చర్య అన్నారు. ఇరాన్ పోరాటం ఎదురించిన తీరు అభినందనీయమన్నారు. గతంలో ప్రపంచాన్ని ఎలా లనుకున్న నియంతలకు ఎటువంటి పరిస్థితి ఎదురైందో ఇప్పుడు ట్రంప్‌కు కూడా అదే పరిస్థితి ఎదురైందన్నారు. అమెరికా దేశంలోనే లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి యుద్ధాన్ని నిరసించారంటే ఇరాన్ యుద్ధంలోనే కాదు అమెరికా అంతర్గత విషయాల్లోనూ విజయం సాధించిందని తమ్మినేని తెలిపారు. భారతదేశం పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో తన ప్రాముఖ్యతను పూర్తిగా కోల్పోయిందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు




పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ దేశ ప్రజలు ఏమైపోయినా ఇబ్బంది లేదు కానీ అంబానీ అదానీ ఇతర తన అనుకూల సంపన్న వర్గాలు బాగుండాలన్న ధోరణిలో పాలన సాగుతుందని ఆయన తెలిపారు. విబి జీ రాం జీ చట్టాన్ని తెచ్చారని ఇది గ్రామీణ పేదల ఉపాధిని కోల్పోయేలా చేసిందన్నారు. విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా పోతుందని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక వ్యవస్థలను ధ్వంసం చేస్తుందని సుదర్శన్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళకు వెళ్లి పినరయ్ విజయన్‌ను విమర్శించడం తగదన్నారు. బిజెపిని నిలువరించడం కమ్యూనిస్టుల ప్రధాన లక్ష్యమని అటువంటప్పుడు నిరాధర ఆరోపణలు అనవసరమన్నారు. ఈ ప్లీనరీలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించగా పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, సుబ్బారావు, బుగ్గవీటి సరళ, పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికులకు వేర్వేరు సర్వీస్ రూల్స్ అన్యాయం

**ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు సిపిఐ పూర్తి మద్దతు: సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు ఐక్యంగా పోరాడి తమ న్యాయమైన హక్కులను సాధించుకోవాలని, ఇప్పుడు ఉన్న హక్కులన్నీ ఎవరి దయా దాక్షిణ్యాలపై రాలేదని పోరాడి సాధించుకొన్నవే అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం మూడవ రోజుకు చేరుకొంది. స్థానిక కేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ఆర్టిజన్‌ల జేఏసి ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె శిభిరాన్ని సిపిఐ శ్రేణులతో కలిసి సంధర్శించారు. సిపిఐ పార్టీ తరుపున తమ పూర్తి మద్దతును ఉంటుందని చెప్పారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి సాబీర్‌పాషా మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయమైనదన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా పాలకులు ఆర్టిజన్ కార్మికులను మోసగించినదని ఆరోపించారు. ఐక్యంగా కలిసి కట్టుగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. వారి హక్కుల సాధన కోసం సిపిఐ పూర్తి మద్దతునిస్తూ ముందుండి పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. పాలక ప్రభుత్వాల కుట్రలకు లోను కాకుండా పోరాటాన్ని కొనసాగించాలన్నారు. కార్మికులు అనుభవిస్తున్న హక్కులన్నీ ఎవరి దయాదాక్షిణ్యాలపై రాలేదని సంఘటింతంగా పోరాడి సాధించుకొన్నవే అని స్పష్టం చేశారు. విద్యుత్ కార్మికులకు రెండు వేర్వేరు సర్వీస్ రూల్స్ ఉండటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ అభివృద్ధి కోసం, నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి కోసం నిరంతరం శ్రమించే ఆర్టిజన్ కార్మికుల పట్ల వివక్ష చూపిస్తూ రెండో శ్రేణి ఉద్యోగులుగా చూడటం అత్యంత బాదాకరమని వాపోయారు. అనునిత్యం పని ప్రదేశంలో బొగ్గు, బూడిదతో కుస్తీ పడుతూ కార్మికులు అనారోగ్యం భారిన పడుతున్నా యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. వారి ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకొని తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టిజన్‌లకు తక్షణమే ఏపిఎస్‌ఈబి రూల్స్ వర్తింపజేయాలని, విద్యార్హతలను బట్టి వెంటనే కన్వర్షన్ చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2026 వేతన సవరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వర్ రావు, గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ, ఏఐటియుసి నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్ గిరి, గొర్రె నరేష్, ఆలపాటి ప్రసాద్, గౌతమి క్రిష్ణ, ఎస్‌ఏ. రహమాన్, రాములు, క్రిష్ణ, బర్ల వెంకటరత్నం, అల్లి వెంకటేశ్వర్లు, ఇరుకు రామారావు, నామా నవీన్, హెచ్. వెంకన్న, పగిడిపల్లి సంజీవరావు, తాటి నాగరాజు, రాజేశ్వరి, లక్ష్మి, కేలోత్ క్రిష్ణ, చిట్టిబాబు, రమేష్, ఆర్టిజన్ జేఏసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# 10వేల ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

**-వేగంగా నిర్మాణాలు చేపట్టాలి**
**-ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఈనెలాఖరు 10వేల ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ఎంపిడివోలు, తహసీల్దార్లు, హౌజింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పదివేల ఇండ్లు గృహాప్రవేశాలకు లక్ష్యంగా కార్యాచరణ చేసినట్లు తెలిపారు. అధికారులు లబ్దిదారులకు అన్ని విధాలా సహాయ సహకరాలు అందించి లక్ష్య సాధనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 9,199 ఇందిరమ్మ ఇండ్లు శ్లాబులు వేశారని 2,018 ఫినిషింగ్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు, ఇట్టి ఇందిరమ్మ ఇండ్లలో ఏప్రిల్ 10 నాటికి 1, 439, ఏప్రిల్ 17 నాటికి 2,794 ఇండ్లు, ఏప్రిల్ 24 నాటికి 2,794 ఇండ్లు, ఏప్రిల్ 30 నాటికి మిగిలిన 2,973 ఇండ్లు గృహాప్రవేశాలకు పకడ్బందీ కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో మొదటివిడతగా 16,497 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు అందులో 1,912 ఇండ్లు ఇంకా నిర్మాణం ప్రారంభించలేదని 2,520 ఇండ్ల నిర్మాణం పూర్తయి గృహాప్రవేశాలు జరిగాయని మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వెలుగుమట్లలో మంజూరు చేసిన 311, వివిధ మండలాల్లో మంజూరు చేసిన 101 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో రోజువారి ప్రగతి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిరంతర సమీక్షలు చేస్తూ పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమీక్షలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఎంపిడివోలు, తహసీల్దార్లు, హౌజింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



# సమాజాభివృద్ధిలో యువత కీలక పాత్ర

**-ఘనంగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాజాభివృద్ధిలో యువత ముఖ్యంగా యువ మహిళలు కీలక పాత్ర పోషించాలని జిల్లా అటవీశాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్, జిల్లా ఉపాధి అధికారిణి మాధవి లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత సుస్థిర భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర గురించి వివరించారు. సమాజాభివృద్ధిలో యువ మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని విద్యార్థినీలను ప్రోత్సహించారు. విద్య, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రధానం చేశారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరా సంస్థ ఏ గ్రేడ్ సన్నరకం క్వింటాకు రూ.2389, కామన్ గ్రేడ్ దొడ్డు రకం క్వింటాకు రూ.2369 ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇస్తుందని వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ అన్నారు. తల్లాడలో సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వడ్లు అమ్ముకుని అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవింద శ్రీను, గొడుగునూరి లక్ష్మి రెడ్డి, కేతేపల్లి భాస్కర్‌రావు, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మి రెడ్డి, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

**-ముందస్తుగా ఇంటి పన్ను చెల్లించిన మేయర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముందస్తుగా ఇంటి పన్ను చెల్లింపుకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన ఐదు శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ఇంటి పన్నుకు సంబంధించి ముందస్తుగా కార్పోరేషన్‌కు ఫోన్‌పే ద్వారా మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం జమ చేశారు. ఈ సందర్బంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలు కూడా ముందస్తుగా తమ ఇంటి పన్ను చెల్లించి ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరాభివృద్ధిలో పన్నుల చెల్లింపు ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో వెంకటలక్ష్మి , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఖమ్మం కార్పోరేషన్ కాంట్రాక్టర్లు, హార్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య లు కలిసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్బంగా ప్రజలకు మజ్జిగ, శుద్ధిచేసిన త్రాగునీటిని పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మేయర్ మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శుద్ధి చేసిన నీటిని అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, హార్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సిసి రోడ్డుకు శంకుస్థాపన :** ఖమ్మం నగరంలోని 42వ డివిజన్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. యుసిఐడి నిధులు రూ. 10 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. నగర ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు పాలక వర్గం కృషి చేస్తుందని ఆమె తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ పాకాలపాటి విజయనిర్మల, శేషగిరి, ఏఈ శ్యామ్, నాయకులు గౌస్, షౌకత్, రమా, నజీమా, ఆయూషా, షాహీన్, కృష్ణ, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సు చార్జీల తగ్గింపు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నుండి తిరుపతి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు చార్జీల ను తగ్గించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రాలో తిరిగే సూపర్ లగ్జరీ బస్సులకు ఆంధ్ర సెక్టార్ లో 16 నుండి 40 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గుంటూరు తిరుపతి మధ్య18 శాతం (రూ.110), చిలకలూరిపేట తిరుపతి మధ్య19 శాతం (రూ. 100), ఒంగోలు తిరుపతి మధ్య 22% (రూ. 30), నెల్లూరు తిరుపతి మధ్య 24%(రూ. 20), నాయుడుపేట తిరుపతి మధ్య 33% (రూ. 30), శ్రీకాళహస్తి తిరుపతి మధ్య 40 శాతం (రూ. 20) రాయితీ ప్రకటించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కావున సత్తుపల్లి డిపో పరిధిలోని తిరుపతి వెళ్లే భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.